క్లుప్తంగా

ఆర్డీఓ, డీఆర్డీఓ సందర్శన



ధర్మసాగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రాన్ని ఆర్డీఓ రామేశ్ రాథోడ్, డీఆర్డీఓ మేన శ్రీను గురువారం సందర్శించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల స్వీకరణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అయితే హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలపై స్టే విధించడంతో సాయంత్రం అధికారులు ఎన్నికల సామగ్రితో వెళ్లిపోయారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్‌మార్, పాల్గొన్నారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

వేలేరు : మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం చేపట్టారు. ఆరు ఎంపీటీసీ స్థానాలకు మూడు నామినేషన్ల స్వీకరణ కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. అలాగే జెడ్పీటీసీ స్థానానికి ఒక కౌంటర్ ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై అజ్మీర సురేశ్ ఆధ్వర్యంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద భద్రత ఏర్పాటు చేశారు. కాగా తొలిరోజు నామినేషన్లు రాలేదని అధికారులు వెల్లడించారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని రైతు వేదికలో 5 క్లస్టర్లలో 13 ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీ స్థానానికి మరొక కౌంటర్ ఏర్పాటు చేయగా మొత్తం 6 కౌంటర్లతో పాటు స్థానిక కార్యదర్శులతో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నర్మద తెలిపారు. తొలిరోజు నామినేషన్‌లు రాలేదని తెలిపారు. అయితే సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికల అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంట ముందుగానే నామినేషన్ పత్రాలు ఇవ్వడం, స్వీకరించడం నిలిపివేశారు. తదుపరి గంట పాటు సీట్లలోనే కూర్చొని 5 గంటలకు ప్రొసీజర్ ప్రకారం నివేదిక అందించి వెళ్లిపోయారు.

వారసత్వ సంపదను కాపాడుకోవాలి



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో గల చారిత్రాత్మకమైన ముఖ్యనాథ స్వామి దేవస్థానాన్ని హనుమకొండలోని భవిష్య స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం విహారయాత్రలో భాగంగా సందర్శించారు. ఆలయ పునర్నిర్మాణ వ్యవస్థాపక చైర్మన్ శివసాని ప్రవీణ్ ఆలయ చరిత్ర, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అదే విధంగా వారసత్వ సంపద, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యనాథస్వామి దేవాలయం చుట్టూ ఉన్న ప్రకృతి అందాలను చూస్తుంటే పర్యాటక ప్రాంతంగా ఆహ్లాదంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయులు తీగల శ్రీధర్, జ్యోత్స్న, రఘు, సునీత, నర్మద, స్వప్న, సరిత, హరిక, జోషిత, శ్రీలత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కటాక్షపూర్ మత్తడి రోడ్డుకు మరమ్మతులు



ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ మత్తడి వద్ద ప్రమాద నివారణ చర్యలు చేపట్టినట్లు సీఐ సంతోశ్ కుమార్ తెలిపారు. గురువారం మత్తడిని పరిశీలించి హైవే కాంట్రాక్టర్‌తో మత్తడిరోడ్డుకు మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. మత్తడిపై నుంచి వాహనాలు నడుస్తున్నాయని, ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

రేషన్‌షాపు తనిఖీ



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన అమ్మ భద్రమ్మకు చెందిన రేషన్‌షాపును తెలంగాణ స్టేట్ టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం గురువారం తనిఖీ చేసింది. రేషన్ దుకాణంలో స్టాక్ వివరాలు పరిశీలించగా అన్ని సరిగానే ఉన్నాయని తెలిపారు.

11నుంచి వర్సిటీ టోర్నమెంట్

మామునూరు: ఖిలా వరంగల్ బొల్లికుంటలోని వాగ్దేవి క్రీడామైదానంలో ఈనెల 11నుంచి 13వ తేదీ వరకు కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కేయూ పరిధి కళాశాలల మహిళల అంతర్ విశ్వవిద్యాలయ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలె లక్ష్మీపతి తెలిపారు. పది రకాల క్రీడాపోటీలు జరగనున్నాయని, పలు జిల్లాల నుంచి 1,513 మంది క్రీడాకారిణులు పాల్గొననున్నారు.

విషజ్వరాల విజృంభణ



పరకాల : ప్రసూతి భవనంలో వైద్యసేవలు అందిస్తున్న సివిల్ ఆస్పత్రి వైద్యులు



ఆత్మకూరు : చికిత్స కోసం వేచిఉన్న రోగులు

- ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిట
- ఒకే బెడ్‌లో ఇద్దరు పేషెంట్లకు వైద్యం
- ఆత్మకూరులో సిబ్బంది కొరత, పరకాలలో భవనం కరువు

పరకాల : విషజ్వరాలు విజృంభించాయి. ఈ కారణంగా పరకాల సివిల్ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతుంది. స్థానిక వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కొనసాగుతుండడంతో ప్రస్తుతం ప్రసూతి ఆస్పత్రి భవనంలోనే సివిల్ ఆస్పత్రి ఓపీతో పాటు రోగుల కోసం 30 పడకలు (15 ప్రసూతి సేవల)తో ఇన్‌వార్డు నిర్వహిస్తున్నారు. సాధారణ రోజుల్లో 100 నుంచి 150 ఓపీ నమోదు కాగా విషజ్వరాలు కారణంగా నెల రోజులుగా 250కి పైగా ఓపీ నమోదవుతుందని ఆస్పత్రి వైద్యులు తెలుపుతున్నారు. ఇన్‌పేషెంట్‌లకు బెడ్లు సరిపోకపోవడంతో ఒకే బెడ్డుకు ఇద్దరు రోగులను ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. మరోవైపు ప్రసూతి వార్డు పక్కనే ఇన్‌పేషెంట్ వార్డు ఉండటంతో చిన్నారులు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉందని, పిల్లల తల్లిదండ్రులు, వారి బంధువులతో పాటు వైద్యులు ఆందోళన చెందుతున్నారు. తాము వైద్యం అందించడం వరకు ప్రయత్నిస్తామని, కానీ సదుపాయాలు ఏలా సమకూర్చగలుగుతామని సమాధానం ఇస్తున్నారు.

ఆత్మకూరులో సిబ్బంది కొరత

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకప్పుడు రౌండ్‌క్లాక్‌గా సేవలందించినప్పటికీ ప్రస్తుతం సిబ్బంది కొరత వేధిస్తుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యసేవలు అందుతున్నప్పటికీ రాత్రి సమయంలో వైద్యసేవలకు ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తుంది. రాత్రి వేళ విధులు నిర్వర్తించేందుకు స్టాఫ్‌నర్సు లేకపోవడంతో 24 గంటల ఆస్పత్రిగా ఉన్న పీహెచ్‌సీలో రాత్రి వేళ సేవలు అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఖాళీ పోస్టులను భర్తీ చేసి రౌండ్‌క్లాక్ సేవలు అందించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

పోస్టులు భర్తీ చేయాలి



రౌండ్‌క్లాక్ సేవలు అందించడం సాధ్యపడడం లేదు. ఆస్పత్రిలో అదనంగా స్టాఫ్‌నర్సు కావాల్సి ఉంది. అలాగే నైట్ వాచ్‌మెన్ ఉండాలి. వీరు ఇద్దరు ఉంటే రాత్రి వేళ వైద్య సేవలు అందించేందుకు వీలు అవుతుంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

– డాక్టర్ స్పందన, ఆత్మకూరు పీహెచ్‌సీ

రోగుల సంఖ్య పెరిగింది



విషజ్వరాల కారణంగా ఆస్పత్రికి రోగుల సంఖ్య చాలా పెరిగింది. ఒకే బెడ్డుపై ఇద్దరికి వైద్యసేవలు అందిస్తున్నాం. కొత్త భవనం అందుబాటులోకి రాకపోవడంతో ప్రసూతి భవనమే దిక్కుగా మారింది. బాలింతలు, గర్భిణులకు, చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ రాకుండా చర్యలు చేపట్టాం.

– డాక్టర్ వరుణ్, పరకాల సివిల్ ఆసుపత్రి

బీసీలను మోసగించిన కాంగ్రెస్

ఐనవోలు : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందన్న విషయం హైకోర్టు సాక్షిగా రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టమైందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తంపుల మోహన్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తుందన్నారు. బీసీలకు రిజర్వేషన్‌లు ఇచ్చే అంశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం పూర్తిగా ఆక్షేపణీయంగా ఉందన్నారు. కోర్టు, ప్రజలను, అధికారులను తప్పుదారి పట్టించి ప్రభుత్వం అభాసుపాలయ్యిందన్నారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ రామ్‌మూర్తి, ఉస్మాన్‌అలీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్

కారు ఢీకొని ఒకరి దుర్మరణం



ఎల్కతుర్తి : రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టగా వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీస్‌లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని మంగళంపల్లి గ్రామానికి చెందిన గొర్రె వెంకటయ్య(57) వేలేరు మండలంలోని తన సోదరి ఇంటికి వెళ్లి గురువారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మంగళంపల్లి స్టేజి వద్ద రోడ్డు దాటుతుండగా సిద్దిపేట వైపు నుంచి కారు అతివేగంగా వచ్చి వెంకటయ్యను బలంగా ఢీ కొట్టింది. దీంతో వెంకటయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన మండలస్థాయి క్రీడోత్సవాలు

పరకాల : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండలస్థాయి క్రీడోత్సవాలు గురువారం ముగిశాయి. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, ఎంఈఓ రమాదేవితో పాటు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, మధు, సురేందర్, ఎఫ్‌సీసీ హెచ్‌ఎంపీ భాస్కర్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబయ్య అభినందించారు.

బిట్స్ విద్యార్థుల ప్రతిభ

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 14–17 క్రీడా పోటీల్లో పరకాల బిట్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ రెడ్డి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో 20 మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులు, పీఈటీ శ్రీకాంత్‌ను అభినందించినట్లు చెప్పారు.

ఎస్‌జీఎఫ్ పోటీలకు హాజరు కావాలి

ఐనవోలు : మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గల 14, 17 సంవత్సరాల బాల, బాలికలు స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు హాజరు కావాలని ఎంఈఓ పులి ఆనందం కోరారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రంతో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు కిరణ్ 99598 78440, కిషన్ 96039 09729, కైలాస్ 99668 67149ను సంప్రందించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రెడ్డి కాలనీ, పాలజెండా, బుద్ధనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పెద్దమ్మ గడ్డ, టాటా మోటార్స్, జ్యోతిబస్ కాలనీ, కేఎస్‌ఆర్ గార్డెన్, ఎస్‌ఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఆ పార్టీకి రాజీనామా చేసి మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి రాజయ్య కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో యూత్ కాంగ్రెస్ నాయకులు కొలిపాక వెంకటేష్, హరీఫ్, రఘుపతి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, భూపతిరాజు, నర్సింగరావు, సురేశ్, తిరుపతి, మహేందర్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరికలు



ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తి గ్రామానికి చెందిన రిపిక ప్రేమ్‌కుమార్, ఎర్ల హరినాథ్, శ్రీనాథ్ గురువారం బీజేపీలో చేరారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి వారికి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, రాజు, రవితేజ, ఉపాధ్యక్షుడు ఆనందం, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రాజేశ్, శ్రీకాంత్, ప్రభాకర్, రాజు, నాగేష్, కిరణ్, సతీశ్, అభిషేక్, శ్రీనివాస్, నందాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘ఓటు చోరీ చేసిన బీజేపీ’



ఖిలా వరంగల్: ఓటు చోరీ చేసి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్, కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, బైరబోయిన ఉమ ఆరోపించారు. వరంగల్ 34, 35వ డివిజన్లలోని శివనగర్, పడమర కోటలో కాంగ్రెస్ నాయకులు బైరబోయిన దామోదర్‌యాదవ్, చిట్టిమల్ల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం వేర్వేరుగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో రావుల విజయరాంచందర్, రంగరాజు వినయ్, సుధాకర్, రంజిత్, రాజేష్, రాధిక, వెంకన్న, రాజు, శ్రీధర్, శ్రీరాంరాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



సమావేశంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

- రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన కమిటీ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

నయీంనగర్: 2024 మార్చి నుంచి 2025 సెప్టెంబర్ వరకు రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ అధ్యక్షుడు ఎస్.ధర్మేంద్ర, సభ్యులు భోగేశ్వర్, దేవదాసు, మహబూబ్ అలీ, అబ్దుల్ గఫార్, చంద్రమౌళి మాట్లాడుతూ రిటైర్డ్ అయి 18 నెలలు గడిచినా ప్రభుత్వం ఇంకా బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. పెన్షనర్లను మానసికంగా వేధించడం, తీవ్ర అనారోగ్యానికి గురిచేయడం ప్రభుత్వానికి సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది రిటైర్డ్ పెన్షనర్లు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ 2020 ఏరియర్స్, జీపీఎఫ్, జీఐఎస్, గ్రాట్యుటీ, కమ్యూటేషన్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో దామోదర్, కుమారస్వామి, నారాయణ, గోవర్ధన్, సంజీవరెడ్డి, లక్ష్మయ్య, సోమయ్య పాల్గొన్నారు.

న్యూశాయంపేట: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ జేఏసీ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు.

తల్లిదండ్రులను ఆశ్రమాల్లో చేర్చడం తగదు



కాజీపేట: తమను కనిపెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి అనాథ ఆశ్రమాల్లో వదిలేయడం తగదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ కె.పట్టాభి రామారావు ఆదేశాల మేరకు కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని సహృదయ అనాథ ఆశ్రమంలో గురువారం ఏర్పాటు చేసిన వృద్ధుల ఉచిత గుండె పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సీహెచ్.శ్రావణ స్వాతి, మహమ్మద్ ఫర్హానా అహ్మద్, చెన్ను లీల, నాగసుస్మిత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించే దమ్ములేకనే రిజర్వేషన్ల డ్రామా

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు : స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ములేకనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాకు తెరలేపిందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధ్వజమెత్తారు. హనుమకొండలోని ఆయన నివాసగృహంలో గురువారం మాట్లాడుతూ.. మాయమాటలతో బీసీలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు కూడా అదే మోసంతో స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయన్నారు. 420 హామీల తరహాలో 42శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కొట్లాడాలని సూచించారు. అఖిలపక్షాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఢిల్లీ వేదికగా జరగాల్సిన పోరాటాన్ని రేవంత్‌రెడ్డి గల్లీలో చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని వారి చేతుల్లో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సమాచార హక్కుచట్టం పౌరులకు ఆయుధం



మాట్లాడుతున్న రాజేందర్

ఆత్మకూరు : ఆర్‌టీఐ (సమాచార హక్కు చట్టం) పౌరులకు ఆయుధమని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సమాచార హక్కుచట్టం 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా పరిరక్షణ వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, వాటి ఖర్చులు తదితర సమాచారం తెలుసుకునేందుకు పౌరులకు సమాచారం హక్కుచట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు దుర్వినియోగం కాకుండా ఆర్‌టీఐ దోహదపడుతుందన్నారు. ఈ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సురేశ్, నాయకులు సదానందం, స్వామి, అయిలయ్య, బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

- పరకాల సీడీపీఓ స్వాతి

దామెర : పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పరకాల సీడీపీఓ స్వాతి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఊరుగొండలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చిరుధాన్యాలలో పోషక పదార్థాలు పుష్కలంగా అభిస్తాయని అన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులతో కలిసి సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ సాధనకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సూపర్‌వైజర్లు మంజుల, పోషణమాసం ప్రత్యేక అధికారి భిక్షపతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలి

శాయంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి ఆదరించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నేరుడుపల్లి, ప్రగతిసింగారం, వసంతాపూర్, గంగిరేణిగూడెం, సూర్యనాయక్‌తండా, అప్పయ్యపల్లి గ్రామాల్లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

చేరికలు..

మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన చిలుకల శ్రీను, మాదాపూర్ సతీశ్, పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో 20 మంది కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి బుచ్చిరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. నాయకులు చంద్రప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణి, రవీందర్, భాస్కర్, కుమారస్వామి, ప్రకాశ్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, సమ్మిరెడ్డి, ఆదిరెడ్డి, భాస్కర్, జగన్, కుమారస్వామితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న బుచ్చిరెడ్డి

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంతోశ్‌కుమార్

ఆత్మకూరు : కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి వెళ్లి అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పిదాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వేణుగౌడ్, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ, నాయకులు బుచ్చిరెడ్డి, పైడి, సదానందం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నం సిగ్గుచేటు

ధర్మసాగర్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు సోంపెల్లి అన్వేష్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రం, దేశంలో దళితులపై అనేక రకాలుగా దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు, పాలకులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులపై దాడులు జరుగకుండా బలమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతి సాగర్, జిల్లా నాయకులు ప్రతాప్, బాబు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు శంషొద్దీన్, పవన్, అనిల్, రాజు, ప్రేమ్, ప్రవీణ్, సిద్ధు, ప్రదీప్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాకర్